రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర) సా.6.24

సహర్ (శని) ఉ.4.44

ఎండా కాలమ్

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అమలాపురం | 33 | 25 |

# మీకు అర్థమవుతోందా!

ఎన్నికల కమిషన్ కోడ్ అమల్లోకి తెచ్చి ఐదారు రోజులవుతోంది. ఇరవై నాలుగు గంటల్లోగా రాజకీయ పార్టీ చిహ్నాలేవీ కనపడకూడదని కూడా హెచ్చరించింది. అయినా అధికారులు మాత్రం తొందరేమీ లేనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. శిలాఫలకాలు, బ్యానర్లు, హోర్డింగ్‌లతోపాటు ప్రభుత్వ భవనాలు, వాహనాలపై జగన్, వైసీపీ రంగులు, చిహ్నాలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులోనే ఇంత ఉదాసీనంగా ఉంటే ఎలా అని జనం ప్రశ్నిస్తున్నారు.


లూటుకుర్రులో శిలాఫలకం

## కోడ్ కొండెక్కిందిలా..

మామిడికుదురు, మార్చి21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కొన్నిచోట్ల ఎన్నికల కోడ్‌ను సరిగా అమలుచేయడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లూటుకుర్రు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకానికి ముసుగు వేయకుండా వదిలేశారు. ఈ శిలాఫలకంపై జగన్, ఎమ్మెల్యే, ఎంపీల చిత్రపటాలు ఉన్నప్పటికీ ముసుగువేయకపోవడంపై అధికారుల నిర్లక్ష్యం కనబడుతోంది. బహిరంగ ప్రదేశాలు, ముఖ్య కూడళ్లలో ఉన్న ఫ్లెక్సీలు, విగ్రహాలకు ముసుగులు వేశారు తప్ప మారుమూల ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను సరిగా అమలుచేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు.




### ఇటు చూడండయ్యా..

మండపేట మండలం ఏడిద గ్రామ పంచాయతీకి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన బోర్డుపై సీఎం జగన్ ఫొటో ఉన్నప్పటికీ తొలగించలేదు. ఇది అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఓ నిదర్శనం మాత్రమే. రాజకీయ పార్టీ నేతల ఫొటోలు ఉండకూడదన్న నిబంధనలు వీరికి వర్తించవా మరి. - మండపేట




### కళ్ల జోళ్లూ వదల్లేదే..

జగనన్న ఆరోగ్యసురక్ష పేరిట కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వం అందించే కళ్లద్దాల బాక్సులపైనా వేసిన సీఎం జగన్, ఆరోగ్యమంత్రి విడదల రజని చిత్రాలు ఇంకా తొలగించకుండానే సచివాలయాల్లో పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఇవన్నీ తొలగించాలి. కానీ సచివాలయాల్లో జగన్, వైఎస్సార్, రజని చిత్రాల కళ్లజోళ్ల బాక్సులు దర్శనమిస్తున్నాయి. - మండపేట

# అన్నదాత అగచాట్లు


కాల్వల్లో సాగునీరు లేకపోవడంతో ట్యాంకరు నీటితో చేనును తడుపుకుంటున్న రైతు

- ఆయిల్ ఇంజన్లతో సాగునీటి మళ్లింపు
- అదనపు భారంతో కౌలు రైతుల గగ్గోలు
- ఆయిల్‌కైనా డబ్బులు చెల్లించాలని డిమాండ్
- చిరుపొట్ట దశలో వరిచేలు.. నీరెంతో ముఖ్యం
- దిగుబడి తగ్గిపోతోందంటున్న రైతులు
- రాజులపాలెంలో వరి దుబ్బులు చూపుతూ ఆవేదన

పి.గన్నవరం, మార్చి 21: అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్టుగా ఉంది సాగునీటి పంపిణీ వ్యవస్థ పనితీరు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ కాల్వలు అధ్వానంగా ఉండడంతో సాగునీరు పంట చేలల్లోకి వెళ్లడం లేదు. నీరు శివారు ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి కనిపించట్లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి డెల్టాలో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రమాదంలో ఉందని, ఇదే ఒరవడి మరికొన్ని రోజులు సాగితే డెల్టా ప్రాంతం బీడుగా మారిపోతుందని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ అలగేషన్ రామస్వామి ప్రభుత్వాన్ని పరోక్షంగా హెచ్చరించారు. ఈసారి రెండో పంట ప్రారంభంలోనే సాగునీరు పూర్తిస్థాయిలో అందక అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో పి.గన్నవరం మండలంలోని రాజులపాలెంతో పాటు పలు గ్రామాల్లో సాగునీరు లేక బోర్ల ద్వారా వరిచేలకు నీటిని మళ్లించుకుంటున్నారు. నాట్లు పూర్తయిన ఇరవై రోజుల నుంచే ఈ ప్రాంతంలో నీటి కష్టాలు మొదలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో రెండో నెంబరు డ్యామ్‌ను ఆధునికీకరణలో భాగంగా మార్పు చేశారని... అప్పటినుంచీ ఆ ఆయకట్టు పరిధిలోని దాదాపు 50 ఎకరాలకు పైగా సాగునీరు పూర్తిస్థాయిలో అందట్లేదని వారు చెప్పారు. డ్యామ్ ప్రారంభంలోనే నీరు తక్కువగా రావడంతోపాటు మధ్యలో అసలు నీరే లేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం చేలన్నీ మడి దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో సకాలంలో నీరందకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే అవకాశముంది. ఇప్పటివరకు బోర్ల ద్వారా ఆరుసార్లు సాగునీటిని మళ్లించుకున్నారు. ఇంకా ఐదుసార్లు మళ్లించుకోవాల్సిన అవసరముంది. ఇందుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు తమపై అదనపు భారం పడుతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మేజర్ డ్రెయిన్లకు అడ్డుకట్ట వేసి అయిల్ ఇంజన్లతో నీటిని కాల్వల్లోకి మళ్లించేవారు. అంతేకాకుండా ఇంజన్లు ఏర్పాటుచేసుకునే రైతులకు అయిల్‌కు సొమ్ము చెల్లించేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. రాజులపాలెం, శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడంతో చేలు నెర్రలు తీశాయి. పలువురు రైతులు వరి చేలల్లో దుబ్బును తీసి చూపిస్తూ లబోదిబోమంటున్నారు.

### అదనపు భారం పడుతోంది..



రెండో పంట కావడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నాం. సాగునీటి రూపంలో కష్టం ఆశ కాస్తా నీటిపాలైంది. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేలు దాటి పెట్టుబడి పెడుతున్నాం. సాగునీటికొరతతో మరో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు భారం పడింది. దీంతో మాకు లాభాలు ఏం వస్తాయి. మా ఒక్క గ్రామంలోనే పది వరకు ఆయిల్ ఇంజన్లు తిరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయిల్‌కైనా డబ్బులివ్వాలి.

- ఈతకోట మునీంద్ర, కౌలు రైతు, రాజులపాలెం


రాజులపాలెంలో వరి దుబ్బుతో రైతుల నిరసన దృశ్యం


రాజులపాలెంలో బోరు ద్వారా సాగునీటిని మళ్లించుకుంటున్న రైతులు

## ట్యాంకర్లతో పొలాలకు సాగునీరు

గింజలు పాలుపోసుకునే దశలో రైతులకు అష్టకష్టాలు.. అదనపు భారం

ముమ్మిడివరం, మార్చి21: సాగునీటి ఎద్దడితో ముమ్మిడివరంలోని కాల్వ శివారు రైతులు ఇబ్బందిపడుతున్నారు. వరి పైరు ఈనిక, గింజలు పాలుపోసుకునే దశలకు చేరుకోవడంతో పొలాలకు సాగునీరు అవసరం ఏర్పడింది. సాగునీరు సక్రమంగా అందకపోతే దిగుబడులు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మోటార్లు, ట్యాంకర్ల ద్వారా నీరు తోడుకునేందుకు పంట కాల్వల్లో నీరు లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మాగాం-అయినాపురం పంటకాల్వలో నీరు పూర్తిగా అడుగంటడంతో పొలాలకు సాగునీరు సరఫరా కావట్లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట దెబ్బతింటే పెట్టుబడులు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ముమ్మిడివరం బాలయోగీశ్వరుల ఆశ్రమ ప్రాంతంలోని అంబేడ్కర్ నగర్‌లో ఓ రైతు దూర ప్రాంతం నుంచి నీటిని ట్యాంకరు ద్వారా తీసుకువచ్చి చేనుకు అందించడం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. నీటి కష్టాలకు ఇదో నిదర్శనం.



## బీటలు వారుతున్న పంట పొలాలు

ఐ.పోలవరం, మార్చి21: వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. తమ కుటుంబాలకు బాసటగా నిలిచే దాళ్వా పంట నీరులేక ఎండిపోవడం చూసి ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటకు మొత్తం పెట్టుబడి పెట్టిన అన్నదాతలకు సాగునీటి ఎద్దడి శాపంగా మారింది. పంట ఈనిక దశలో నీరందక పొలాలు బీటలు వారుతుంటే రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని టి.కొత్తపల్లి, జి.వేమవరం, గుత్తెనదీవి, తిళ్లకుప్ప, పశువుల్లంక గ్రామాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వరిపైరుకు సాగునీటి సమస్య తలెత్తింది. జి.వేమవరం తదితర ప్రాంతాల్లో రైతులు అధిక వ్యయప్రయాసలకోర్చి ఆయిల్ ఇంజన్లతో నీటిని పొలాలకు మళ్లించుకుంటున్నారు. సాగునీరవ్వకపోతే ఈనిక బలహీనపడి దిగుబడులు పడిపోతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.


వైసీపీ నాయకుడు, ఆర్బీకే చైర్మన్ చంద్రరావు ఇంటిముందు ఆందోళన చేస్తున్న మంగాదేవి, ఆమెకు సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాల ప్రతినిధులు

## వైసీపీ నాయకుడు మోసం చేశాడంటూ కేశవరంలో మహిళ ఆందోళన

బాధితురాలికి మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాల ప్రతినిధులు

ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం : రూరల్ ఎస్ఐ

మండపేట, మార్చి 21: తనను మోసగించడమేగాకుండా భారీగా నగదును కాజేశాడంటూ వైసీపీ నాయకుడి ఇంటి ముందు ఓ మహిళ ఆందోళన చేపట్టింది. మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన ఆర్బీకే చైర్మన్ అన్నందేవుల చంద్రరావు తనను మోసం చేసి భారీగా నగదును కాజేశాడని, తనకు న్యాయం చేయాలంటూ బాధిత మహిళ చంద్రరావు ఇంటి వద్ద గురువారం ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా మండపేటకు చెందిన బాధితురాలు మంగాదేవి మాట్లాడుతూ తనను నమ్మించి కేశవరం గ్రామానికి చెందిన చంద్రరావు 2009లో ఆదే గ్రామానికి తీసుకువెళ్లి తన భర్త నుంచి విడాకులు ఇప్పించాడని తెలిపింది. తనతో సంబంధం పెట్టుకోవడమేగాకుండా, ఆ తర్వాత బతుకుదెరువు కోసం తాను హైదరాబాద్ వెళ్లి అక్కడ సంపాదించిన నగదును దఫదఫాలుగా మొత్తం రూ.23 లక్షలు అతనికి ఇచ్చానని బాధితురాలు ఆరోపించింది. తాను చంద్రరావును భర్తగా నమ్మి మోసపోయానని ఆమె చెప్పింది. తనకు కేశవరంలో 4 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని చెప్పి తనకు అగ్రిమెంట్ కూడా రాశాడని ఆమె చెప్పింది. తన భవిష్యత్‌తోపాటు పిల్లల బాధ్యత తీసుకుంటానని చెప్పి మోసగించాడని ఆరోపించింది. తాను కష్టపడి సంపాదించిన సొమ్మంతా చంద్రరావుకే ఇచ్చానని, ఇప్పుడు ఆ డబ్బును ఇవ్వకపోగా తనపై అసత్య ప్రచారం చేశాడని ఆమె ఆరోపించింది. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు, స్థానిక నేతలకు ఫిర్యాదు చేసినా చంద్రరావు తన అధికార పలుకుబడి వినియోగించి తనకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నాడని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ బీసీ, ప్రజా సంఘాలకు చెందిన వారితో కలిసి గురువారం సాయంత్రం చంద్రరావు ఇంటి ముందు టెంట్‌వేసి ఆందోళనకు దిగింది. చంద్రరావుకు వ్యతిరేకంగా మంగాదేవికి న్యాయం చేయాలంటూ ప్రజాసంఘాల ప్రతినిధులు నినాదాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న మండపేట రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ఎస్ఐకు, ఆందోళనకారులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఎన్నికల సమయంలో ఇలా టెంట్‌లు వేసి ఇళ్ల ముందు ఆందోళన చేయడం తగదని ఎస్ఐ అభ్యంతరం చెప్పారు. ఏదైనా విషయం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు. అయితే రూరల్ పోలీసులకు ఇదే అంశంపై ఫిర్యాదు కూడా చేశానని బాధితురాలు చెప్పింది. ఆందోళన నేపథ్యంలో చంద్రరావును వివరణ కోరగా ఆమెకు, తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. కేవలం ఎన్నికల సమయం కావడంతో తనను మంగాదేవి డబ్బుల కోసం ఇలా బ్లాక్‌మెయిల్ చేస్తోందన్నారు. తాను స్థలం కోసం అగ్రిమెంట్ రాసిచ్చిన కాగితంలో సంతకం తనదికాదని, తనకు.. అగ్రిమెంట్‌కు సంబంధం లేదని చెప్పారు. కాగా బాధితురాలికి సంఘీభావంగా మహిళా సంఘం సభ్యులు శ్రీవాణి, రేష్మాబేగం, లక్ష్మీ, దేవి, పి.కాంతం, బీసీ సంఘం నాయకుడు వాసంశెట్టి రాజేశ్వరావు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్‌ను వివరణ కోరగా ఎన్నికల కోడ్ ఉన్నందున అనుమతులు లేకుండా టెంట్లువేసి ఆందోళనలు చేయడం నిషిద్ధమన్నారు. మంగాదేవి ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. తమకు బాధితురాలి నుంచి ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.



## అభ్యర్థులు క్రిమినల్ కేసుల వివరాలను ప్రకటించాలి : జిల్లా కలెక్టర్

అమలాపురం,మార్చి21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులుంటే వాటిని ప్రకటించాల్సి ఉంటుందని కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎఫ్ఐఆర్ నంబర్లతో సహా నామినేషన్ మూడో భాగంలో తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కేసుల వివరాలను నిర్దీత గడువులోగా పత్రికలు, టీవీల్లో ప్రముఖంగా కనిపించే విధంగా మూడుసార్లు ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. కేసులు ఉన్నప్పటికీ ఆయా అభ్యర్థులకు టిక్కెట్లను కేటాయించిన రాజకీయ పార్టీలు కూడా తగిన వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ ప్రక్రియపై అధికారులతోపాటుగా రాజకీయపార్టీల ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలోను పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. జిల్లాలో 15,18,195మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ రోజున ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహిస్తారన్నారు. ఈవీఎంలతోపాటు టెండర్, చాలెంజ్ ఓట్లను ప్రతీ పోలింగ్ బూత్‌కు ఇవ్వడం జరుగుతుందని, కొత్తగా హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. దీనికోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుపై ఎన్నికల వ్యయ పరిశీలకుల నిఘా ఉంటుందని చెప్పారు. స్వతంత్ర అభ్యర్థులకు నామినేషన్ పత్రాలపై పదిమంది ప్రపోజల్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ ఆస్తులతోపాటు తమ కుటుంబ సభ్యుల ఆస్తులతోపాటు విదేశాల్లో ఉన్న ఆస్తుల వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టంచేశారు.

## అది వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఇల్లా..

ఎవరో ఫైనాన్స్ ఇప్పిస్తానంటే అక్కడకు వెళ్లా

తీరా వెళ్లాక తెలిసింది వైసీపీ నేత ఇల్లు అని..

అవాక్కై వచ్చేశా : జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల

వైసీపీ ఎంపీతో భేటీ అయ్యారన్న వార్తలపై వివరణ


అమలాపురంలో మాట్లాడుతున్న జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజబాబు

అమలాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అది వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి ఇల్లు అని నాకు తెలియదు. ఎవరో ఒకరు ఎన్నికల ఖర్చు కోసం ఫైనాన్స్ ఇప్పిస్తానంటే అక్కడికి వెళ్లాను. తీరా అది ఫైనాన్సర్ ఇల్లు అని వెళ్లారు. అక్కడి వెళ్లేసరికి ఆ ఇంటి ఆవరణలో వైసీపీ నాయకుడి ఇల్లు అని తెలిసిన తరువాత బయటకు వచ్చేశానని అమలాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు స్పష్టంచేశారు. రెండు రోజుల కిందట రాజబాబు తాడేపల్లిలోని మిథున్‌రెడ్డి ఇంటికి వెళ్లారని వీడియోలు, ఫొటోలతో సోషల్ మీడియాలో రాజబాబు వైసీపీలోకి జంప్ అంటూ జరిగిన ప్రచారం నేపథ్యంలో గురువారం సాయంత్రం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో అది ఎంపీ మిథున్‌రెడ్డి ఆఫీస్ అని చెబుతున్నారు. కానీ నేను ఫైనాన్స్ కోసం ఒక ఫైనాన్సర్ తీసుకువెళ్తే లోనికి వెళ్లాను. అక్కడ వైసీపీ నేత ఇల్లు అని తెలిసిన తర్వాత బయటకు వచ్చేశా. ఏ పార్టీలో ఉన్న నేతలకు ఆ పార్టీ నేతల ఇళ్లే తెలుస్తాయి. జనసేనలో ఉన్న తనకు వైసీపీ నేతల ఇళ్లు ఎందుకు తెలుస్తాయని, అది మిథున్‌రెడ్డిదా కాదా అనేది నాకు ఇప్పటికీ క్లారిటీ లేదు. ఫైనాన్స్ కోసం వెళ్లాను. పరిస్థితి చూసిన తరువాత వచ్చేశానంటూ రాజబాబు వెల్లడించారు. ఎన్నికల్లో ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు మాత్రమే అక్కడకు వెళ్లానంటూ వివరించారు. కొన్ని రాజకీయ శక్తులు తనపై చేసిన కుట్రలో భాగంగానే సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగిందని ఖండించారు. జనసైనికులు మనోధైర్యాన్ని కోల్పోకుండా పార్టీ అభ్యున్నతికి ముందడుగు వేయాలని సూచించారు. అయితే అమలాపురం టిక్కెట్ విషయంలో జనసేనలో రెండు గ్రూపులు ఉన్నాయని టీడీపీ నేతలు దుష్ప్రచారంచేసి ఆ సీటును దక్కించుకోవాలనుకోవడం దారుణమన్నారు. ఇక్కడ జనసేన పటిష్ఠంగా ఉందని, 50వేలకు పైగా మెజారిటీతో తనకు నెగ్గే సత్తా ఉందని ఆయన చెప్పారు. ఎన్నికల్లో టిక్కెట్ రాకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయను. పవన్‌కల్యాణ్ ఆదేశాలను శిరోధార్యంగా తీసుకుని ఆయన గెలిపిస్తానని చెప్పారు. టిక్కెట్ తనకే వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలను శిరోధార్యంగా భావించి ఎన్నికల్లో కృషి చేస్తానని స్పష్టంచేశారు. ఈ సమావేశానికి అమలాపురం పట్టణానికి చెందిన కీలక జనసేన నాయకులంతా గైర్హాజరయ్యారు.



బాలయోగి స్టేడియంలో ఓటు హక్కు విశిష్టతపై ప్రచారం నిర్వహిస్తున్న డీఆర్వో, మహిళలు

## ప్రలోభాలకు లోనవ్వకుండా ఓటేయాలి : డీఆర్వో



అమలాపురం టౌన్, మార్చి 21: ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలకు గురికావద్దంటూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యంలో ఓటర్ల భాగస్వామ్యం(స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాధాన్యతను చాటి చెప్పే విధంగా డ్వాక్రా మహిళలకు రంగోళి పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మహిళలు, యువత ఓటుహక్కు పట్ల పూర్తి అవగాహనతో వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఓటు విశిష్టతను వివరిస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అభివృద్ధి అధికారిణి ఎం.ఝాన్సీరాణి, ఏపీసీ మధుసూదనరావు, మహిళలు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ఎగ్జామినర్స్ తప్పనిసరిగా హాజరుకావాలి

అమలాపురంటౌన్, మార్చి21: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకన కోసం నియమించబడిన అసిస్టెంట్ ఎగ్జామినర్స్ తప్పనిసరిగా స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు హాజరుకావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వనుములు సోమశేఖరరావు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎకనమిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల పరీక్షా పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్స్ విధిగా హాజరుకావాలని కోరారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆయా అధ్యాపకులను రిలీవ్‌చేసి పంపించడం వల్ల సమయానికి ఇంటర్ బోర్డు ఫలితాలను విడుదల చేయగలుగుతుందన్నారు. ఇప్పటికే వాల్యుయేషన్ క్యాంపులో గణితం, తెలుగు, ఇంగ్లీషు, పౌరశాస్త్రాల సబ్జెక్టులకు కొంతమంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్ హాజరుకాకపోవడం వల్ల మూల్యాంకనంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వెంటనే వారు రిపోర్టు చేయాలని సోమశేఖరరావు కోరారు.

## జిల్లాలో 96 శాతం పనిదినాలు పూర్తిచేశాం : డ్వామా పీడీ

పి.గన్నవరం, మార్చి21: ఉపాధిహామీ పనులకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 57 లక్షల పనిదినాలు లక్ష్యంగా ఇప్పటివరకు 55.24 (96.91 శాతం) లక్షల పనిదినాలు పూర్తిచేసినట్టు డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. పి.గన్నవరం ఉపాధి హామీ కార్యాలయంలో మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 19,002 పనులు నిర్వహించగా రూ.147.18 కోట్ల వేతనాలు కూలీలకు చెల్లించామని రూ.61.03 కోట్లు మెటీరియల్ రూపంలో ఇచ్చామని.. వెరసి రూ.208.21 కోట్లు ఖర్చుచేసినట్టు వివరించారు. అలాగే ఇప్పటివరకు 9,088 కుటుంబాలు వంద రోజులు పని పూర్తిచేసుకున్నట్టు ఆయన తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చే జూన్ వరకు 6,750 పనులు గుర్తించి 49,42,812 పనిదినాలు రూపొందించామని, కలెక్టర్ అనుమతులు మంజూరుచేశారని చెప్పారు. ఎంపీడీవో సిహెచ్.త్రిశూలపాణి, ఏపీడీలు జీవీకే మల్లిఖార్జున, జి.కవిత, ఏపీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పోలీసు, ఫైర్ శాఖల్లో జిల్లాలో పలువురికి ఉగాది పురస్కారాలు

అమలాపురం టౌన్, మార్చి 21 : పోలీసు శాఖలో ప్రతి ఏటా ప్రకటించే రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారాలను గురువారం హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మన జిల్లాకు సంబంధించి సేవాపతకం విభాగంలో డీఏఆర్ ఏఆర్‌హెచ్‌సీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరాజు, అమలాపురం టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎం.నాగేంద్ర సతీష్‌కుమార్, ఫైర్ సర్వీస్ శాఖలో ఉత్తమ సేవాపతకం విభాగంలో రాజోలు ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ బి బాలకృష్ణ, సేవా పతకం విభాగంలో కొత్తపేట ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ కేవీవీ రాంప్రసాదరావులు పురస్కారాలకు ఎంపికయ్యారు.



# కరెంటు పంచాయితీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఏ వ్యవస్థకైనా అవస్థ తప్పదు మరి.. చివరికి విద్యుత్ పంపిణీ సంస్థదీ అదే పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ తీరు కారణంగా నాలుగేళ్ల నుంచీ అవస్థలతో కొట్టుమిట్టాడుతోంది. సామాన్యుడు ఓ రూ.150ల బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సిబ్బంది ఠంచనుగా వచ్చి ఫీజు లాక్కెళ్లిపోతారు. వినియోగదారుడు మళ్లీ ఏ అప్పోసొప్పో చేసి జరిమానాతో బిల్లు చెల్లించి కరెంటు ఆఫీసుకు వెళ్లి బతిమలాడుకుంటే ఏ సాయంత్రానికో దయతలచినపుడో వచ్చి సరఫరా పునరుద్ధరిస్తారు. ఈ అధికార దర్పమంతా సామాన్యుడి విషయంలోనే. పెద్దలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ విషయంలో పనిచేయదు. ఈ క్రమంలో కరెంటు పంపిణీ సంస్థకు, విద్యుత్ అధికారులకు ఇప్పుడు 'కరెంటు పంచాయతీ' తెగడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు కరెంటు వైరుకు పట్టుకున్న కార్బన్ మాదిరిగా పేరుకుపోవడంతో బిల్లుల వసూళ్లకు విద్యుత్ అధికారులు, సిబ్బంది చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదు.

- విద్యుత్ పంపిణీ సంస్థకు కొండలా బకాయిలు
- చెల్లించాల్సిన వీధిలైట్ల బకాయిలు రూ.283 కోట్లు
- విద్యుత్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ కార్యాలయాల తీరూ అదే
- చెల్లించాల్సిన బిల్లులు సుమారు రూ.43 కోట్లు
- విద్యుత్ సిబ్బంది ప్రదక్షిణలు..అయినా ప్రయోజనం శూన్యం



## నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి..

పంచాయతీలు సాధారణంగా వీధి దీపాలకు, తాగునీటి సరఫరా చేయడానికి మోటార్లకు విద్యుత్ ఎక్కువగా విని యోగిస్తుంటాయి. దీని నిమిత్తం కరెంటు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా బిల్లుల చెల్లింపులు క్రమం త ప్పాయి. గతంలో పంచాయతీల్లో వీధి దీపాలు తదితర అవస రాలకు వినియోగించిన బిల్లుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ పంపిణీ సంస్థలకు సర్దుబాటు చేస్తూ ఉండేది. దీంతో ఇటు పంచాయతీలకు, అటు పంపిణీ సంస్థలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత నాలుగేళ్లగా పంచాయతీలనే నేరుగా కరెంటు బిల్లులు కట్టుకోవాలని చెప్పడంతో కష్టాలు ఎక్కువయ్యాయి. అసలే నిధులు, విధులు లేకుండా మూలుగుతున్న పంచాయతీల నెత్తిపై తాటిపండు పడినట్లయ్యింది. పంచాయతీల్లో సొమ్ములు లేక.. నిధులు రాక నాలుగేళ్లుగా బిల్లులు చెల్లించలేకపోయారు. పంచాయతీలకు గ్రాంటు రూపంలో వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులు దారి మళ్లడం, సర్పంచ్‌ల అధికారంతో ఆటలు ఆడడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లు లేకుండా ప్రత్యేకాధికారుల పాల నలో ఉన్న పంచాయతీల్లో కూడా బకాయిలు పేరుకుపోయా యి. ఆర్డీవో, సబ్ కలెక్టరు స్థాయి అధికారులు ప్రత్యేక అధికా రులుగా వ్యవహరిస్తుండడంతో విద్యుత్ సిబ్బంది నోళ్లు మెదప లేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శులకు విద్యుత్ అధికారులు ఫోన్లు చేస్తే ఏదోక సమాధానం చెప్పి కాలయా పన చేస్తున్నారని చెబుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే ప్రజలు ఇబ్బంది పడతారనే కారణంతో విద్యుత్ సిబ్బంది బతిమలాడుకోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

జిల్లాలను విభజన చేసినప్పటికీ విద్యుత్ సర్కిల్‌ని విభ జించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 1029 పంచాయతీలు ఈ సర్కిల్ పరిధిలోనే ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పంచాయతీల బకాయిలు రూ.9,14,48,198.. తూర్పుగోదావరి (విభజిత) రూ.149,38,34,662.. కాకినాడ జిల్లా 94,83,51,858.. కోనసీమ జిల్లా రూ.29,46,49,471.. వెరసి మొత్తం రూ.282,82,84,189 బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందాక

## పేరుకుపోయిన బకాయిలు ఇవే

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ అంటే 11 నెలల బిల్లులు వసూ లు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పినా ఫలితం కానరావడం లేదు. ఉమ్మడి తూర్పులోని పంచాయతీల్లో కోలమూరు రూ.1.05 కోట్ల బకాయిలతో తొలి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరుసగా ధవళేశ్వరం రూ.1.03 కోట్లు, దివాన్ చెరువు రూ.1 కోటి, ద్వారపూడి రూ.97.56 లక్షలు, హుకుంపేట రూ.92 లక్షలు, శాటిలైట్ సిటీ పంచాయతీలో రూ.86.27 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

## ప్రభుత్వ కార్యాలయాల తీరిది..

పంచాయతీల మాదిరిగానే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలూ విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. వీటిలో గ్రామీణ నీటి సరఫరా, వైద్యం, రెవెన్యూ శాఖలు ముందు వరుసలో ఉన్నా యి. ప్రభుత్వ కార్యాలయాలకు నెలకు సుమారు రూ.40 కోట్ల విద్యుత్ బిల్లులు వస్తుంటే 10% కూడా వసూలుకాని పరిస్థితి ఉంది. గత నెల 29 నాటికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.15,87,93,696.. తూర్పు గోదావరి రూ.13,92,01,030.. కాకినాడ జిల్లా రూ.31,77,43,944.. కోనసీమ జిల్లా రూ.12,84,84, 656.. మొత్తం కలిపి ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.74,42,23,326 ఉన్నాయి. గతంలో బడ్జెట్ కేటాయింపుల ప్రకా రం నిధుల విడుదల ఉండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించేసేవారు. కానీ, నాలుగేళ్ల నుంచీ అస్తవ్యస్తం కావడంతో సమస్య తలెత్తిందని చెబుతున్నారు.

# గరుడ వాహనంపై ఊరేగింపు

ఘనంగా కొనసాగుతున్న నరసన్న కల్యాణోత్సవాలు





గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



పండిత సభ నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 21: లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై నాలుగు మాఢ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు పండ్లు, పుష్పాలు సమర్పించి మంగళహారతులిచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

### అలరించిన పండిత సభలు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రంగరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు జరిగాయి. ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహభట్టర్ స్వామి అధ్యక్షతన సభలో కందాడై శ్రీనివాసాచార్య, భద్రాచలం ఆస్థాన పండితుడు కందాడై మురళీకృష్ణ స్వామి వివిధ ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో రంగరాజ భట్టర్, పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు, పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి సత్తిబాబు, ఇరగవరపు కృష్ణామాచార్యులు, మార్గపురి రాంబాబు సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, ఇసుకపల్లి రాజారావు, కొత్తంగి బుచ్చి రామయ్య పాల్గొన్నారు.

# అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



ఏర్పాట్లపై ప్రశ్నిస్తున్న భక్తులు

కోరుకొండ, మార్చి 21: నరసన్న కల్యాణోత్సవాల్లో ఈ సంవత్సరం అన్నవరం దేవస్థానం అధికారులు అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తూ భక్తులను అవమానిస్తున్నారని గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, మాజీ సర్పంచ్ నీరుకొండ బాబ్జి, పలువురు కల్యాణ దంపతులు నిరసన వ్యక్తం చేశారు. గత రాత్రి స్వామి వారి కల్యాణం సందర్భంగా ఒక్కో దంపతుల నుంచి రూ.1116 రుసుము తీసుకున్న అధికారులు కల్యాణం అనంతరం వారికి అందజేయాల్సిన స్వామి వారి ముత్యాల తలంబ్రాలు, లడ్డు ప్రసాదాలు అందించలేదని పేర్కొన్నారు. 225 మంది స్వామి వారి కల్యాణం టిక్కెట్లు తీసుకుని పీటలపై కూర్చున్నారు. వీరందరికీ వరుస క్రమంలో ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందించాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంతో తోపులాట జరిగి కల్యాణ దంపతులకు తలంబ్రాలు, లడ్డూలు అందలేదని వారు ఆరోపించారు. అన్నవరం దేవస్థానానికి సుమారు 200 మంది సిబ్బంది కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. అయితే వారు ఎవరూ బాధ్యత తీసుకోకపోవడంతో భక్తులకు అడుగడుగునా తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. అదే విధంగా భక్తులకు ఉచిత దర్శనం గేటుకు తాళం వేసి ఉంచడం వల్ల భక్తులు అందరూ తప్పనిసరిగా టిక్కెట్ కొని దర్శనానికి వెళ్లాల్సిన ఇబ్బందికర పరిస్థితులను అన్నవరం దేవస్థానం అధికారులు కావాలనే కల్పిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

# వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్ దంపతులు



స్వామి,అమ్మవార్లు

యానాం, మార్చి 21: యానాంలో శ్రీవారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులు గావించారు. కల్యాణాన్ని అనువంశిక ఉత్సవదారులు చింతా వెంకటసుబ్బరావు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్-లక్ష్మీస్నేహ దంపతులు కూడా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, సువర్ణ యజ్ఞోపవీతం, సువర్ణ మంగళ సూత్రం, ముత్యాల తలంబ్రాలు అందించారు. వేద పండితులు కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా జరిపించారు. తిలకించడానికి వచ్చిన ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణను అతిథులు ప్రారంభించారు. గురువారం సాయంత్రం తోట వేణుగోపాల రావునాయుడు ఉత్సవదారులుగా ఉన్న హనుమంత వాహనంపై స్వామివారిని ఆశీనులు గావించి విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారు విహరించగా భక్తులు తిలకించి తరించారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), మార్చి 21: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష, మరో 12 మందికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని కాకినాడ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురు వాహనదారులకు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. మరో 12 మందికి తలో రూ. 10 వేలు జరిమానా ఇలా మొత్తం రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్-2 సీఐలు చైతన్యకృష్ణ, రమేష్ తెలిపారు.

### కార్పెంటర్ ఆత్మహత్య

అల్లవరం, మార్చి 21: యజమానిని మోసగించానన్న మనస్తాపంతో ఓ కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలేనికి చెందిన కార్పెంటర్ మల్లాడి లక్ష్మణరావు (50) అమలాపురంలోని మాధవి ఫర్నీచర్ షాపులో పనిచేస్తున్నాడు. అతను యజమాని పేరిట కొన్ని సామాన్లు తెచ్చి అమ్మాడు. దీనిపై యజమాని అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు కావడంతో యజమానిని మోసగించిన మనస్తాపంతో ఇంటి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ ఆత్మహత్యగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# ఇంత నిర్లక్ష్యమా?



వంట గది నిర్వహణ

- పొంచివున్న ప్రమాదం
- ఒకే గదిలో ఎండీఎం, అంగన్వాడీ వంటకాలు
- పక్కనే పిల్లల తరగతులు
- ఫైర్ సిబ్బంది హెచ్చరించినా అదే తీరు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల విద్యార్థుల భద్రతా విషయంలో నిర్లిప్తంగా ఉండడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో అంగన్వాడీ కేంద్రాలు వేరుగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలల్లో కలిపారు. దీంతో అటు చిన్నారులకు బోధన చేసే విషయంలో, ఇటు వంట చేసే విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లాలాచెరువు సమీపంలోని ఓ ప్రాథమిక పాఠశాలలోకి అంగన్వాడీని తరలించారు. అయితే అప్పటికే మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న చిన్న వంటగదిలోనే అంగన్వాడీ పిల్లలకు వంట చేయడానికి సర్దుకోవాలని చెప్పారు. దీంతో ఇలా ఫొటోలో కనిపిస్తున్న విధంగా రెండు సిలిండర్లను, రెండు పొయ్యిలను పక్కపక్కన పెట్టి రోజూ వంట చేస్తున్నారు. ఆ గదికి ఆనుకొనే పిల్లల తరగతి గదులు ఉన్నాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాద నివారణపై ఈ పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అప్పుడు రెండు సిలిండర్లు, పొయ్యిలు ఒకేచోట పెట్టి వంట చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మార్పు చేసుకోవాలని సూచించారు. కానీ, ప్రధానోపాధ్యాయుల తీరులో నేటికీ మార్పు రాలేదు. దీంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా పెద్ద నష్టానికి దారి తీసే అవకాశం ఉందంటూ తల్లిదండ్రులు భయపడుతున్నారు. అంగన్వాడీ వర్కర్‌లకు వంట కోసం వేరే గది ఇచ్చే అవకాశం ఉన్నా.. ఆ గదిని వ్యర్థాలకు ఉపయోగిస్తుండడం బాధ్యతా రాహిత్యానికి రుజువని చూపుతున్నారు.

# ప్రతి జీవికి అడవితో అనుబంధం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ




సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, మార్చి 21: ప్రపంచంలో ప్రతి జీవికి అడవులతో సంబంధాలు ఉంటాయని ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. దివాన్ చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ ఏడాది అడవులు ఆవిష్కరణ-మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు అనే థీమ్‌తో అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కృష్ణప్రియ వివరించారు. మనం తాగేనీరు, ఆహారం, మందులు, ఆశ్రయం, ఆక్సిజన్ కోసం అడవులతో సంబంధం కలిగి ఉంటుందని అటువంటి అడవులను కాపాడేందుకు అటవీశాఖ కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ అడవులను పరిరక్షించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ రాబోయే తరాలకు మంచి వాతావరణంలో జీవించే అవకాశాలను కల్పించాలని కోరారు. శిక్షణలో ఉన్న అటవీ బీట్ అధికారులు మాట్లాడుతూ ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎర్రచందనం, పెద్దపులి, కలివి కోడి వంటి వాటిని ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్రం హెచ్‌వోడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వృక్షశాస్త్రం, అటవీ విజ్ఞానాన్ని పెంపొందించడంలో తమ కళాశాల బోటనీ విద్యార్థులు కృషి చేస్తున్నారని, బోటనీ విభాగం అటవీశాఖతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు అటవీ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. చివరిగా కళాశాల విద్యార్థులు, అధికారులు కలిసి అటవీ సంరక్షణలో తమ వంతు పాత్రను మనస్ఫూర్తిగా నిర్వహిస్తామని, పర్యావరణానికి ప్రతికూలమైన ఏ చర్యను చేపట్టబోమని ప్రతిజ్ఞ చేశారు.

## శీతల పానీయాల గోదాములో అగ్నిప్రమాదం



కరప, మార్చి 21: కరపలోని ఒక శీతల పానీయాల గోదాములో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానిక పీఏసీఎస్ గోదాములో గ్రామానికి చెందిన కొర్ల చక్రయ్య శీతల పానియాల స్టాకు పెట్టుకుని హోల్ సేల్, రిటైల్ వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం రాత్రి గోదాముకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం తెల్లవారుజామున గోదాము షెట్టర్ల నుంచి పొగలు వస్తుండడం గమనించి తెరిచి చూశాడు. అప్పటికే మంటలు చెలరేగి రూ.85 వేల నగదు, ల్యాప్‌టాప్, కౌంటింగ్ మిషన్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, శీతల పానియాల కేసులు, ప్రింటర్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్ స్టేషన్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. వీఆర్వో ప్రభుదాస్ ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

## ఎంఎల్ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, మార్చి 21: పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న సివిల్‌సప్లైస్ గొల్లప్రోలు ఎంఎల్ఎస్ పాయింట్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సరుకుల నిల్వల్లో భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన మండల లెవెల్ స్టాక్ పాయింట్‌లో విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరిపారు. సరుకుల నిల్వలను పరిశీలించారు. ఇందులో పలు లోపాలు బయటపడ్డాయి. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన కందిపప్పు రికార్డుల్లో కంటే 3.99 క్వింటాళ్లు అధికంగా ఉన్నట్లు, రేషన్‌కార్డుదారులకు అందించాల్సిన కందిపప్పు 7.13 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పామాయిల్ లీటరు ప్యాకెట్లు 112 అదనంగా ఉండగా, అరలీటరు ప్యాకెట్లు 245 తక్కువగా ఉన్నాయి. గోధుమపిండి 3.87 క్వింటాళ్లు, పంచదార 1.74 క్వింటాళ్లు, ఫోర్టిఫైడ్ బియ్యం 5 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడయింది. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు వెలుగుచూడటంతో పాటు స్టాకు బోర్డుపై నిల్వల వివరాలు రాయకపోవడం, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడాన్ని గుర్తించారు. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సివిల్‌సప్లైస్ డీఎంకు సిఫారసు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు విజయకుమార్, జీవానందం వలీ, సీఎస్ డీటీ మర్రి వీరాస్వామి పాల్గొన్నారు.

## నేటి నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు





విద్యుత్ దీపాలంకరణ

దేవరపల్లి, మార్చి 21: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాల్లో అన్ని మతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం విశేషం. హిందువులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటారు. తలనీలాలు సమర్పించడం, ముడుపులు సమర్పించడం చేస్తుంటారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ తెలిపారు.

# డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

.అమలాపురం .పి.గన్నవరం .రాజోలు .ముమ్మిడివరం .కొత్తపేట .మండపేట .రామచంద్రపురం



వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

## వైభవంగా చింతలూరు వెంకన్న కల్యాణం

ఆలమూరు, మార్చి 21: ఉత్తర ముఖద్వారంతో నిత్య వైకుంఠంగా విరాజిల్లుతున్న ఆలమూరు మండలం చింతలూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణాన్ని వేద పండితులు బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. మహిళలు పసుపు కొమ్ములను దంచి పసుపు తయారుచేసి కల్యాణంలో వినియోగించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ద్విభాష్యం కాశీవిశ్వనాథ శర్మ, అల్లంరాజు భరణి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### కోరుమిల్లిలో సోమేశ్వరస్వామి కల్యాణం

కపిలేశ్వరపురం, మార్చి 21: మండలంలోని కోరుమిల్లిలో రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి సత్రం వీరవల్లిపాలేనికి చెందిన ఫౌండర్ ముద్రగడ వీరేశ్వరరావుతో కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ చైర్మన్ ఆచంట వీరాస్వామి, గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

### మాచవరంలో రాజేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట, మార్చి 21: మాచవరంలో శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

### అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



కె.గంగవరం, మార్చి 21: మండలంలోని కొత్తకోట అభయాంజనేయస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పమాలలతో సుందరంగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన జరిపారు.

## శ్రీరామ జన్మభూమి టోకెన్ విడుదల



అమలాపురం టౌన్, మార్చి 21: అయోధ్యలో ఇటీవల ప్రారంభమైన శ్రీరామ జన్మభూమి ఆలయంతో కూడిన టోకెన్‌ను కోల్‌కతాకు చెందిన భారత ప్రభుత్వ టంకశాల విడుదల చేసింది. ఈ టోకెన్‌పై ఒకవైపు శ్రీరామ జన్మభూమి ఆలయం, మరోవైపు రామ్‌లల్లా విగ్రహాన్ని ముద్రించారు. 50 గ్రాముల పూర్తి వెండితో తయారుచేసిన ఈ టోకెన్‌ను పరిమిత సంఖ్యలో విడుదల చేయగా అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రత్యేక ఆర్డరుపై రప్పించారు. దీని ముఖ విలువ పేర్కొనలేదు. టోకెన్‌గా వ్యవహరించే దీని విలువను రూ.5306గా టంకశాల నిర్ణయించిందని ఆయన చెప్పారు.

## అంగర పశు వైద్యాధికారి సస్పెన్షన్

అమలాపురం, మార్చి 21: కపిలేశ్వరపురం మండలం అంగర పశువైద్యాధికారి వి.రమణమూర్తిపై సస్పెన్షన్ వేటు పడింది. సాధారణ తనిఖీల్లో భాగంగా అమలాపురం డిప్యూటీ డైరెక్టర్ కర్నీడి మూర్తి ఇటీవల అంగర పశువైద్యశాలకు వెళ్లారు. అయితే ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఫోను చేసి రప్పించారు. అక్కడికి చేరుకున్న రమణమూర్తి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని డీడీ మూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శాఖాపర చర్యల్లో భాగంగా రమణమూర్తిని సస్పెండ్ చేస్తూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా అధికారులు ధ్రువీకరించారు. రమణమూర్తి స్థానంలో మాచర పశువైద్యాధికారి మాధురికి బాధ్యతలు అప్పగించారు.

### ప్రమాదంలో ప్రజాస్వామ్యం: డీబీ లోక్

ఉప్పలగుప్తం, మార్చి 21: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని భారత రిపబ్లికన్ పార్టీ (కె) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ వ్యాఖ్యానించారు. గొల్లవిల్లి భీమేశ్వరా ఆడిటోరియంలో పందు రాజేష్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోను, రాష్ట్రంలోను నియతృత్వం రాజ్యమేలుతోందన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని, అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు, ఉప్పలగుప్తం, అల్లవరం మండల శాఖల అధ్యక్షులు దారా బాలకృష్ణ, యల్లమిల్లి అఖిల్ పాల్గొన్నారు.

### పోతవరం పంచాయతీ అభివృద్ధికి రూ.5లక్షలు విరాళం

పి.గన్నవరం, మార్చి 21: పోతవరం గ్రామానికి చెందిన మెట్రోకామ్ కంపెనీ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) పంచాయతీ అభివృద్ధికి రూ.5లక్షలు విరాళం అందించినట్టు సర్పంచ్ వడలి కొండయ్య తెలిపారు. పంచాయతీలో ఫర్నిచర్‌కి రూ.2లక్షలు, పంచాయతీ ఎదురుగా షెడ్ ఏర్పాటుకు రూ.3లక్షలు అందించారు. వెంకటేశ్వరావుకు సర్పంచ్ కొండయ్యతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆరగట్లపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

అల్లవరం, మార్చి 21: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా బెండమూర్లంక ఆరగట్లపాలెంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెండమూర్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, ఆప్తామాలజిస్ట్ మీర్జాహసన్ 72 మందికి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్‌పీ చంద్రమౌళి, డాక్టర్ డీవీ జనార్దనరావు, ప్రోగ్రాం అధికారి ఎస్‌డీ నాయుడు, ఈఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్లు బీవీ లక్ష్మి, వై.శ్యామలకుమారి పాల్గొన్నారు.

### 'రిపేర్లు చేయించి పోలింగ్‌కు సిద్ధం చేస్తాం'

ఆలమూరు, మార్చి 21: మండలంలోని పెదపళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం లోపల శ్లాబ్ పెచ్చులు ఊడిపోతోంది. దీనిని పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఆలమూరు తహసీల్దారు అనిల్‌కుమార్ పాఠశాలను పరిశీలించారు. భవనంపై పిచ్చి మొక్కలను తొలగించి పెయింట్లు వేయించి రిపేర్లు చేసి పోలింగ్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు జానకి, వీఆర్వో ఉదయకుమార్ వున్నారు.

### కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ల సమావేశం

అమలాపురం రూరల్, మార్చి 21: కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ల సమావేశాన్ని గురువారం బండారులంకలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కామన ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఏడు నియోజకవర్గాల్లో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఈ నెల 25 నుంచి జరిగే మండల స్థాయి సమావేశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఆయా సమావేశాలకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరవుతారన్నారు. నియోజకవర్గ కన్వీనర్లు వంటెద్దు బాబీ, గెడ్డం సురేష్‌బాబు, కుడుపూడి శ్రీను, వాకపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా బాల సత్యనారాయణ

మామిడికుదురు, మార్చి 21: కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నీతిపూడి బాలసత్యనారాయణను నియమించారు. ఈ మేరకు తనకు అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన గురువారం తెలిపారు.

# చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

**టీడీపీ-జనసేన-బీజేపీ ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు**

ముమ్మిడివరం, మార్చి 21: వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధోగతిపాలు చేశారని ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు స్వగృహం వద్ద అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఉజ్వల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో రూ.1800 కోట్లతో తమ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ సూపర్-6 పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మండలంలోని పళ్లవారిపాలేనికి చెందిన వైసీపీ నాయకుడు నిమ్మకాయల రాజా 50 మందితో పార్టీలో చేరగా వారికి బుచ్చిబాబు, హరీష్‌మాధుర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, గెద్దనాపల్లి మాజీ సర్పంచ్ గిడ్డి నాగరాజు కూడా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దాట్ల పృధ్వీరాజ్, తాడి జానకీరామ్, వేగిరౌతు రాజబాబు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, పిల్లి నాగరాజు, పళ్ల రాజబాబు, చింతలపూడి కొండబాబు, నడింపల్లి శ్రీనివాసరాజు, రంకిరెడ్డి రాంబాబు, మాదాల పరంకుశం, గోదశి గణేష్, కుంచనపల్లి నారాయణ, పళ్ల రామారావు, సత్తి నూకరాజు, కురసాల శివబాబు, కాశి లాజర్ తదితరులు పాల్గొన్నారు.



రాజాకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్



సింహ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామి

## సింహ వాహనంపై శ్రీవారు

రావులపాలెం, మార్చి 21: రావులపాలెంలో శ్రీఅలమేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహ వాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు జరపగా భక్తులు, గోవింద మాలధారులు తిలకించారు.



పుల్లేటికుర్రులో రైతు భరోసా కేంద్రానికి తెలుపు రంగు వేసిన దృశ్యం



ఈవోకు విరాళం చెక్కు అందిస్తున్న వాసవి నిత్యాన్నదాన ట్రస్టు ప్రతినిధులు

### అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, మార్చి 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి శ్రీవేంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్టు చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ట్రస్టు ప్రతినిధులు రూ.50వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,82,216 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.




హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

### భీమేశ్వర స్వామి హుండీల ఆదాయం
## రూ.10.44 లక్షలు

ద్రాక్షారామ, మార్చి 21: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనరు డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి గురువారం వరకురూ.10,44,556 ఆదాయం లభించిందని ఈవో పీటీవీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, అర్చకులు, సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముసుగు తీశారు... తెల్ల రంగేశారు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంబాజీపేట, మార్చి 21: మండల పరిషత్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి ముసుగు వేయడంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఇన్‌చార్జి ఎంపీడీవో వి.వరలక్ష్మి స్పందించారు. దానిని వెంటనే తొలగింపజేశారు. 'వైసీపీ ప్రచార కార్యాలయాలుగా ఆర్బీకేలు' కథనానికి కూడా అధికారులు స్పందించారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు తెలుపు రంగు వేయాలని ఎంపీడీవో ఆదేశించారు. దీంతో ఆయా భవనాలకు వైసీపీ రంగులు తొలగించి వైట్ వాష్ వేశారు.

మామిడికుదురు తహసీల్దారు కార్యాలయంలో కాటన్ విగ్రహానికి వేసిన ముసుగును 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అధికారులు స్పందించి తొలగించారు.



విజేతలతో బీవీసీ కళాశాల చైర్మన్ కృష్ణసతీష్

### ముగిసిన బీవీసీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

అమలాపురం రూరల్, మార్చి 21: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 15 రోజులుగా జరిగిన బీవీసీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. మెకానికల్, ఈసీఈ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ని ప్రారంభించారు. మెకానికల్ జట్టు విజయం సాధించింది. యు.విక్రమ్, జె.సురేష్ అంపైర్లుగా వ్యవహరించారు. కళాశాల స్పోర్ట్స్, గేమ్స్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. విజేతలకు షీల్డులు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, రవణం మాధవి, మురళీకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ ఆంద్రే మెర్మాండ్

## 'సంవత్సరంలో వెయ్యి ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తాం'

మామిడికుదురు, మార్చి 21: అంజు ఐకేర్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, విజన్ ఫర్ ఆల్ స్విట్జర్లాండ్ సంయుక్తంగా సంవత్సరంలో వెయ్యి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ తేజ, డాక్టర్ ఆంద్రే మెర్మాండ్ తెలియచేశారు. మామిడికుదురులోని అంజు కంటి ఆసుపత్రి ఆవరణలో నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేసే వైద్య శిబిరాన్ని గురువారం వారు ప్రారంభించారు. వృద్ధాప్యంలో వచ్చే శుక్లాన్ని శస్త్ర చికిత్స చేసి లెన్స్ అమర్చడం ద్వారా సరిచేయవచ్చని డాక్టర్ తేజ తెలిపారు. భవిష్యత్తులో తమఫౌండేషన్ ద్వారా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామన్నారు. శిబిరంలో శస్త్ర చికిత్స చేయించుకునే వారు అంజు ఆసుపత్రిలో వివరాలు సమర్పించాలని కోరారు. వైద్యులు కేవీ సత్యనారాయణస్వామి, విజయలక్ష్మి, లత, రూహి, మేనేజరు స్వామి, భరత్, సూర్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నామన ఫౌండేషన్ ఆర్థిక సాయం

మామిడికుదురు, మార్చి 21: నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మగటపల్లిలో రోగులు, దివ్యాంగులు తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని చైర్మన్ నామన రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో నామన వినోద్, నామన శృతి, తిరుమల సీతామహలక్ష్మిశ్రీనివాస్, నామన రమేష్, బొలిశెట్టి ఏసుబాబు, బొలిశెట్టి జయరామ్, నామన కిరణ్, దామిశెట్టి బాబులు, సరెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం

యానాం, మార్చి 21: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం పుదుచ్చేరి రాష్ట్రానికి ఇద్దరు వ్యయ పరిశీలకులను నియమించింది. పుదుచ్చేరికి ఐఆర్ఎస్ అధికారి డి.లక్ష్మీకాంతన్‌ను కారైకాల్, మాహే, యానాం నియోజకవర్గాలకు సంబంధించి ఎండీ మజూరుల్ హాసన్‌ను నియమించారు. వీరు పుదుచ్చేరిలోని జిప్‌మెర్ అతిథి గృహంలో ఉంటారు.

### స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు

యానాం, మార్చి 21: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి తొలి నామినేషన్ దాఖలైంది. పుదుచ్చేరిలోని తట్టన్‌చావిడికి చెందిన ఎ.కుట్టాన్ అలియస్ దీవాన్‌దీ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కులుతుంగన్‌కు గురువారం అందజేశారు. మరో రెండు రోజుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న దంపతులు

### సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు

మామిడికుదురు, మార్చి 21: మాకనపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీసత్యనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్త దంపతులు కర్తలుగా పాల్గొని వ్రతమాచరించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి తిరు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వాంగసుందరంగా అలంకరించారు.



మండపేట గొల్లపుంత కాలనీలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

## 'నిర్భయంగా ఓటు వేయాలి'

మండపేట మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని మండపేట పట్టణ పోలీసులు, కేంద్ర రక్షణ బలగాల సిబ్బంది పిలుపునిచ్చారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో గురువారం సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకే కవాతు జరిపినట్టు పట్టణ ఎస్ఐలు చిన్నారావు, వెంకటేశ్వరరావు చెప్పారు.

**పి.గన్నవరం:** ఓటు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన పి.గన్నవరంలో ఓటు హక్కు వినియోగంపై ఉపాధి హామీ మేట్లకు అవగాహన కల్పించారు. ముంగండపాలెం శివారు గాజులగుంటలో ఓటు హక్కు వినియోగంపై టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి ఉమావరలక్ష్మి, ఈసీ సీహెచ్ విజయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఏపీడీలు జీవీకే మల్లికార్జున, జి.కవిత, ఏపీవో సీహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 'రామచంద్రపురం టిక్కెట్ జనసేనకు కేటాయించాలి'

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 21: రామచంద్రపురం అసెంబ్లీ టిక్కెట్‌ను జనసేనకు కేటాయించాలని కోరుతూ గురువారం జనసేనికులు గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు. పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఇతర నాయకులు కలిశారు. ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీకి చెందిన స్థానికేతరుడుని నియమించారని, ఆయన కోసం పనిచేయడానికి పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపట్లేదన్నారు. ఇక్కడ జనసేన బలంగా వున్న నేపథ్యంలో తమకే కేటాయించాలన్నారు. నాగేంద్రబాబు పోటీ చేయాలని, తాము గెలిపించుకుంటామని చెప్పారు. పొత్తులో భాగంగానే టీడీపీకి కేటాయించారని నాదెండ్ల మనోహర్ తెలిపినట్టు నాయకులు తెలిపారు. తమ అభిప్రాయాలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు పోలిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. మంగళగిరి వెళ్లిన వారిలో జనసేన రామచంద్రపురం పట్టణ కన్వీనర్ గొల్లపల్లి కృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు పోతాబత్తుల విజయకుమార్, కె.గంగవరం మండల శాఖ అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, కాజులూరు మండల శాఖ అధ్యక్షుడు బొండా వెంకన్నరావు, ఇతర నాయకులు వున్నారు.



వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ చంద్రావతి

## వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కపిలేశ్వరపురం, మార్చి 21: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ పెట్టెం చంద్రావతి, సుబ్బారావు, తుట్టపు రామకృష్ణ, కొమ్మిశెట్టి సురేంద్ర, బొర్రా కృష్ణకిషోర్, కొమ్మిశెట్టి నాగేశ్వరరావు మండపేటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వి.సాయికుమార్‌బాబు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్మిశెట్టి సుబ్బారావు, కొమ్మిశెట్టి రాంబాబు, కవల కృష్ణ, సాకా శ్రీను, వాద ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### తాటాకిల్లు దగ్ధం: రూ.2లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్, మార్చి 21: రెడ్డిపల్లిలో గురువారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో ఈ ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో మంటలను అదుపు చేశారు. తవిటిక శ్రీను, తవిటిక మంగాదేవి కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు తెలిపారు. సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్ దంపతులు బాధిత కుటుంబానికి బియ్యం, వంట పాత్రలు, నూతన వస్త్రాలతో పాటు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, నల్లా సతీష్ దంపతులు తమ వంతు ఆర్థిక సాయం అందించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు బాధిత కుటుంబాలకు సాయం చేశారు.

### కోడి పందేల శిబిరాలపై దాడులు

ఆత్రేయపురం, మార్చి 21: మండలంలోని ఆత్రేయపురం, వసంతవాడ గ్రామాల్లో గురువారం కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. శిబిరాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

### రేపటి నుంచి 93వ వర్ధంతి సభలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 21: కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సభలు, సదస్సులను ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల బాలుర వసతిగృహంలో పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్దు, పీవైఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు వి.భీమశంకరం, అంబటి కృష్ణ, రైతు కూలీ సంఘం నాయకుడు చింతా రాజారెడ్డి గురువారం ఆవిష్కరించారు.

### ఎన్ఏసీఎల్‌లో భద్రతా వారోత్సవాలు

రావులపాలెం, మార్చి 21: మండలంలోని ఈతకోట ఎన్ఏసీఎల్ ఫ్యాక్టరీలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను హెచ్‌పీడీ హెడ్ పి.సుబాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈతకోట, గంటి, పలివెల పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మెటీరియల్ హెడ్ శ్రీనివాసరాజు, సేఫ్టీ అధికారి పి.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### సినిమా గైడ్

**అమలాపురం**

| | |
|---|---|
| వెంకటరామ | : అనన్య |
| వెంకటరమణ | : లైన్‌మెన్ |
| శ్రీలలిత | : గామి |
| శేఖర్ స్క్రీన్-1 | : రజాకార్ |
| శేఖర్ స్క్రీన్-2 | : హనుమాన్ |
| రమా | : ప్రేమలు |
| గణపతి | : గుంటూరు కారం |
| వెంకటపద్మావతిస్క్రీన్-1 | : ఓం భీం బుష్ |
| వెంకటపద్మావతి స్క్రీన్-2 | : భీమ |

### నీటిశుద్ధి యంత్రం బహూకరణ

కపిలేశ్వరపురం, మార్చి 21: మండలంలోని మాచర జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు రూ.10వేలు విలువ చేసే నీటిశుద్ధి యంత్రాన్ని హెచ్ఎం రమాదేవికి అందజేశారు. గురువారం ఆమె దానిని లాంఛనంగా ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రహదారి ఆధునికీకరించాలని ఆందోళన

రావులపాలెం, మార్చి 21: జాతీయ రహదారి నుంచి కాలనీకి వెళ్లే రహదారిని ఆధునికీకరించాలని ఆ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని ఈతకోట నెక్కంటి సీఫుడ్స్ సమీపంలో ఉన్న నెక్కంటి కాలనీకి వెళ్లే రహదారి బుధవారం కురిసిన వర్షానికి ఛిద్రమైంది. ఇంటింటికీ కుళాయి పనుల్లో భాగంగా మట్టి తవ్వగా వర్షానికి బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఓ బాలిక జారి పడడంతో చేతికి తీవ్ర గాయమైంది. దీంతో కాలనీ వాసులు ఆందోళనకు దిగి ఫ్యాక్టరీ లోపలికి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు సిబ్బందితో అక్కడికి చేరుకుని స్థానికులతో చర్చలు జరిపారు. రహదారిని ఆధునికీకరిస్తామని ఫ్యాక్టరీ యజమాన్యం రాతపూర్వకంగా హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని కాలనీవాసులు భీష్మించారు. ఎన్నికల అనంతరం రహదారిని బాగు చేయిస్తామని ప్లాంటు యజమానులు హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. రహదారిపై బురదను, మంచినీటి పైపులైను కోసం తవ్విన మట్టిని యంత్రం సహాయంతో పంచాయతీ సిబ్బంది సరిచేయించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.